ప్రజాశక్తి
సోమవారం 3 నవంబరు, 2025
5
శ్రీకాకుళం



నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి నిర్వహించనున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో వెల్లడించారు. అర్జీదారులు నమోదు చేసుకోవడానికి Meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లో అర్జీలు నమోదు చేసుకోవచ్చునని పేర్కొన్నారు. అర్జీ దారుల అర్జీల నమోదు, నమోదైన అర్జీల గురించి వాటి స్థితి దానికి సంబంధించి సమాచారం గురించి తెలుసుకోవాలంటే 1100 నేరుగా కాల్ చేయవచ్చని వివరించారు. అర్జీదారులు ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



ఆధునీకీకరణకు నోచుకోని కోడిరామ్మూర్తి స్టేడియం

నగరంలోని డే అండ్ నైట్ సమీపంలో ఉన్న కోడిరామ్మూర్తి స్టేడియం ఆధునికీరణ నిర్మాణ పనులకు రాజకీయ క్రీడ నెలకుంది. ప్రభుత్వాలు, పాలకులు మారినా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా స్టేడియం పనులు ఉన్నాయి. జిల్లాలో ప్రాధాన్యత ఉన్న ఈ స్టేడియం పనులు ఎప్పటికి పూర్తవుతుందోనని ప్రజలు ఎదురుచూస్తున్నారు. జిల్లాలో కీలకమైన కేంద్రమంత్రి, రాష్ట్ర మంత్రి ఉన్నా స్టేడియం నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదు.

రాజకీయ క్రీడ

- కోడిరామ్మూర్తి స్టేడియంకు వీడని గ్రహణం
- కేంద్రమంత్రి ఉన్నా... ముందుకు సాగని పనులు
- 2017లో పనులు ప్రారంభం
- ఇప్పటికీ మోక్షం లేని వైనం

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

నగరంలోని కోడిరామ్మూర్తి స్టేడియం ఆధునికీకరణ పనులను 2017లో ప్రారంభించారు. తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉండగా ఈ పనులు ప్రారంభమయ్యాయి. అప్పటి రాష్ట్ర క్రీడలశాఖ మంత్రిగా కింజరాపు అచ్చెన్నాయుడు వ్యవహరించేవారు. మధ్యలో ఐదేళు వైసిపి ప్రభుత్వం అధికారంలో ఉంది. ఆ సమయంలో కనీసం పనులు ప్రారంభించిన దాఖలాలు లేవు. పనులు ప్రారంభించి ఏడేళ్లవుతున్నా స్టేడియం నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదు. ఎప్పటికీ పూర్తవుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. రూ.15 కోట్లతో నిర్మాణాలు ప్రారంభించారు. పరిపాలన భవనాలు, గ్యాలరీ, అధునాతన ట్రాకులతో మైదానాన్ని తీర్చిదిద్దే లక్ష్యంతో పనులు ప్రారంభించారు. 2019లో వైసిపి ప్రభుత్వం ఏర్పడింది. ఈ ఐదేళ్లలో సైతం పనులు ముందుకు సాగలేదు. వైసిపి హయాంలో జిల్లాలో కీలకమైన ఇద్దరు రాష్ట్ర మంత్రులు ఉన్నా ఆ ఐదేళ్ల ప్రభుత్వ కాలంలో పనులు పూర్తి చేయలేకపోయారు. రోడ్ల భవనాల శాఖకు పనులు అప్పగించారు. బిల్లులు చెల్లింపులో జాప్యం సమస్యగా మారింది. రూ.15 కోట్లతో టెండర్ల ఖరారు చేయగా, రూ.ఐదు కోట్ల వరకు బిల్లులు చెల్లించారు. బిల్లులో జాప్యం నిర్మాణానికి ప్రధాన అవరోధంగా చెప్పవచ్చు. జాప్యం వల్ల అసంపూర్తి పనులు పాడవటం, మళ్లీ ప్రారంభించారు. ధరల్లో తేడాల వల్ల నిర్మాణ అంచనా వ్యయం పెరుగుతుంది. ఇది ఒక ప్రధాన సమస్యగా మారింది. కాంట్రాక్టరు గడువులోగా పనులు పూర్తి చేస్తేనే అంచనాల మేరకు సాధ్యమవుతుంది. జాప్యం వల్ల అంచనా విలువ పెరుగుతుంది. ఇది ప్రధాన సమస్యగా మారి పనులు నిలిచిపోయేందుకు అవకాశం ఏర్పడుతుంది.

చిక్కుల్లో కాంట్రాక్టరు

ప్రస్తుతం కాంట్రాక్టరు సంక్షోభంలో చిక్కుకోవడం సమస్యగా మారింది. సింహాచలం నిర్మాణాల్లో గోడ కూలటం, ఈ నిర్మాణాన్ని చేపట్టిన కాంట్రాక్టరును బ్లాక్ లిస్టులో ప్రభుత్వం పెట్టింది. ఆ కాంట్రాక్టరు కోడిరామ్మూర్తి స్టేడియం పనులు చేస్తున్నారు. దీంతో పూర్తిగా పనులు నిలిచిపోయాయి. మళ్లీ టెండర్లు వేయడం, సకాలంలో బిల్లులు చెల్లించడం, కొత్త అంచనాల రూపొందించటం వంటి చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం విఫలమైంది. దీంతో క్రీడాకారులకు శాపంగా మారింది. ప్రస్తుతం స్టేడియం నిర్వహణ సైతం సక్రమంగా లేదు. పిచ్చి మొక్కలు ఆవరిస్తున్నాయి. చిన్న వర్షానికి స్టేడియం చెరువును తలపిస్తుంది. ప్రజాప్రతినిధులు, జిల్లా ఉన్నత అధికారులు ప్రత్యేక దృష్టి పెడితేనే నిర్మాణాలు పూర్తికి అవకాశం ఉంటుంది. ఈ ప్రభుత్వ సమయంలోనైనా పూర్తిచేసే అవకాశం ఏర్పడుతుంది. స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్ సిఎం నారా చంద్రబాబు నాయుడు దృష్టికి సైతం సమస్య తీసుకువెళ్లారు. అయినా పనులు మాత్రం ప్రారంభం కాలేదు. పనులు ప్రారంభించాలని క్రీడాకారులు, జిల్లా ప్రజలు కోరుతున్నారు. నిర్ధిష్ట క్యాల వ్యవధి నిర్ణయించి నిధులు మంజూరు చేస్తేనే పనులు పూర్తయ్యే అవకాశం ఉంది. లేదంటే ఏళ్ల గడిచినా స్టేడియం పనులు అసంపూర్తిగా దర్శన మిస్తాయి.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా..



స్టేడియం నిర్మాణ పనుల విషయాన్ని ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్తాను. జిల్లా క్రీడాభివృద్ధిశాఖ అధికారిగా బాధ్యతలు చేపట్టి రెండు రోజులైంది. పూర్తిస్థాయి అవగాహన లేదు. భవిష్యత్‌లో ప్రత్యేక దృష్టి పెడతా. పనులు స్థితి గతులు తెలుసుకుంటా.

– ఎ.మహేష్‌బాబు, డిఎస్‌డిఒ, శ్రీకాకుళం

వాకింగ్‌కు అవసరం



కోడి రామ్మూర్తి స్టేడియం జిల్లాలో ప్రాధాన్యత గలది. క్రీడావసరాలు కీలకమైంది. ఎంతోమంది వాకింగ్‌కు వస్తుంటారు. ప్రస్తుతం ఇది దీర్ఘకాలిక సమస్యగా మారింది. ప్రభుత్వం స్పందించి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి. నిర్మాణ పనులు పూర్తయ్యే సమయం కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారు.

– ప్రొఫెసర్ హనుమంతు లజపతిరాయ్, పూర్వ వైస్ ఛాన్సలర్, బిఆర్ఎయు

నాన్న... వెళ్లొస్తా

నాన్న... వెళ్లొస్తా అంటూ ఉత్సాహంగా గుడిబాట పట్టిన కొడుకు ఆ బాటలోనే తన జీవనయానం ముగించుకుంటే...

మూటలు మోసైనా నిన్ను మురిపెంగా చూసుకుంటానన్న ఆ తండ్రి మాట నీటిముట్టై తడిసిపోతుంటే...

ముసిముసినవ్వులతో తిరుగాడే తన కొడుకును మార్చురీ మంచంపై చూస్తూ ఆ తండ్రి కళ్లలో గంగ ఉప్పొంగుతుంటే...

కఠినమైన పాషాణ హృదయాన్ని కూడా కరిగించే ఆ దృశ్యం గుండెల్ని పిండేస్తోంది...

కాశీబుగ్గ ఆలయంలో శనివారం జరిగిన తొక్కిసలాట మృతుల హృదయ విదారక దృశ్యాలకు ఈ చిత్రం ఒక సజీవ సాక్ష్యంగా నిలుస్తోంది.

– కవిటి, ప్రజాశక్తి



ప్రమాదానికి కొద్దిసేపు ముందు చిరునవ్వులు చిందిస్తున్న నిఖిల్

మార్చురీలో ఉన్న కొడుకును చూసి బోరుమటున్న తండ్రి



ఆందోళన చేస్తున్న కార్మికులు

విడిఎ పాయింట్లు పెంచాలి

ఎచ్చెర్ల: పెరుగుతున్న ధరలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం విడిఎ పాయింట్లను పెంచాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, కార్యదర్శి ఎన్. వి.రమణ డిమాండ్ చేశారు. అక్టోబరు 31న కార్మికశాఖ ఇచ్చిన గెజిట్ నోటిఫికేషన్‌లో ఒక్క విడిఎ పాయింట్ కూడా పెంచకుండా కార్మికులకు నష్టం చేసి, యాజమాన్యాలకు లాభం చేకూర్చే దుర్మార్గ వైఖరిని ఖండించాలన్నారు. మండలంలోని అరిణాం అక్కివలస వద్ద ఉన్న శ్యాంక్రగ్ పిస్టన్స్, రింగ్స్ స్టాఫ్, వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యాన ఆదివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఆరు నెలలకు సంబంధించిన కరువు భత్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం సున్నాగా ప్రకటించిందన్నారు. వాస్తవ పరిస్థితి ధరలు ఆకాశానికి – జీతాలు పాతాళానికి అన్నట్లుగా ఉందని విమర్శించారు. రాష్ట్రంలో 72 షెడ్యూల్డ్ పరిశ్రమల్లో పనిచేసే 50 లక్షల మందికి చట్టప్రకారం ఈ కరువు భత్యం వర్తిస్తుందని తెలిపారు. కనీస వేతన చట్టప్రకారం ప్రతి ఐదేళ్లకూ పెంచాల్సిన కనీస వేతనం పెంచడం మానివేశాయని అన్నారు. ఇప్పటికి మూడు సార్లు పెరగాల్సిన జీతం కార్మికులు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం జీతం పెరగడం అంటే కరువు భత్యం ఒక్కటేనని దానికీ రాష్ట్రం ప్రభుత్వం సున్నా చుట్టిందని విమర్శించారు. ధరలు పెరుగుదలకు అనుగుణంగా కరువు భత్యం పెంచకపోతే ఆందోళన చేయడం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు జె.అప్పలరాజు, పి.సురేష్, కె.అప్పలనాయుడు, జె.వెంకటసూరి, ఎం.నాగభూషణం, బి.నారాయణమూర్తి, పి.మహేష్, పి.దుర్గాప్రసాద్, డి.రాంబాబు, గౌరీశంకర్, సూర్యనారాయణ పాల్గొన్నారు.

అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం

కేంద్ర, రాష్ట్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, అచ్చెన్నాయుడు



టెక్కలి : చెక్కును అందజేస్తున్న కేంద్ర, రాష్ట్ర మంత్రులు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

వెంకటేశ్వర ఆలయంలో తొక్కిసలాట ప్రమాద బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని, అధైర్య పడవద్దని కేంద్రమంత్రి కె.రామ్మోహన్ నాయుడు, వ్యవసాయశాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు అన్నారు. ఈ తొక్కిసలాట ఘటనలో పల్లివూరు పంచాయతీ దుక్కవానిపేటకు చెందిన మురిపింటి నీలమ్మ మృతి చెందారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం ప్రకటించిన రూ.15 లక్షల చెక్కును స్థానిక ఎమ్మెల్యే గౌతు శిరీషతో కలిసి మృతురాలి కుటుంబ సభ్యులకు అందించారు. తొక్కిసలాట ఘటన దురదృష్టకరం అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.2 లక్షల ఎక్స్‌గ్రేషియా త్వరలో అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఎపిటిపి కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పుచ్చ ఈశ్వరరావు, మాజీ ఎంపిపి జి.వసంతస్వామి, కర్ని రమణ, గోవింద పాపారావు, తిమ్మల కృష్ణారావు, మురిపింటి పాపారావు పాల్గొన్నారు.

మందస : కాశీబుగ్గ వెంకటేశ్వరస్వామి ఆలయంలో తొక్కిసలాటలో మండలంలోని బిల్లుపెట్టిగాకు చెందిన దువ్వు రాజేశ్వరి, మందసకు చెందిన బోయ చంద్రకళ మృతుల కుటుంబాలకు దేవాదాయశాఖ మంత్రి ఆనం నారాయణరెడ్డి, ఎమ్మెల్యే గౌతు శిరీషలు రూ.15 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెక్కులను అందజేశారు.

టెక్కలి : పలాసలోని కాశీబుగ్గ వెంకటేశ్వర ఆలయం వద్ద జరిగిన ఘటనలో మండలంలోని పిట్టల సరియా, రామేశ్వరం గ్రామాల్లోని విజయ, నీలమ్మ మృతి చెందిన విషయం విదితమే. మృతుల కుటుంబాలకు కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు చెక్కుల అందజేశారు. కార్యక్రమంలో కోటబొమ్మాళి మార్కెట్ కమిటీ చైర్మన్ బగాది శేషగిరి, టిడిపి నాయకులు మామిడి రాము, ధోని కొండలరావు, మట్ట పురుషోత్తం, దల్లి ప్రసాద్‌రెడ్డి, మెండ దమయంతి, రియ్యి ప్రీతిష పాల్గొన్నారు.

నందిగాం : కాశీబుగ్గ వెంకటేశ్వరస్వామి ఆలయంలో తొక్కిసిలాటలో మండలంలోని శివరాంపురానికి చెందిన చిన్ని యశోద మృతి చెందిన విషయం విదితమే. మృతురాలి కుటుంబ సభ్యులు రమణమ్మకు కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, మంత్రి అచ్చెన్నాయుడులు రూ.15 లక్షల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో టెక్కలి ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తి, టిడిపి మండల అధ్యఓఉలు పి.అజయ్‌కుమార్, టిడిపి నాయకులు చంద్రవేఖరరావు, ఎం.బాలకృష్ణ, ఎస్.జానకిరామ్, తహశీల్దార్ కామేశ్వరరావు పాల్గొన్నారు.

సోంపేట : కాశీబుగ్గ వెంకటేశ్వరస్వామి ఆలయంలో తొక్కిసలాటలో మండలంలోని బెంకిలికి చెందిన లొట్ట నిఖిల్ మృతి చెందిన విషయం విదితమే. ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ మృతుని తల్లి అనుసూయను పరామర్శించి ప్రభుత్వం మంజూరైన రూ.15 లక్షల చెక్కును అందించారు. అలాగే బాలుడు మృతి చెందాడనే ఉద్దేశంతో కలెక్టర్ అదనంగా మంజూరు చేసిన రూ.లక్ష చెక్కును కూడా అందించారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి దాసరి రాజు, తహశీల్దార్ బి.అప్పలస్వామి పాల్గొన్నారు.

క్షతాత్రులకు...

శ్రీకాకుళం రూరల్ : కాశీబుగ్గ వెంకటేశ్వర ఆలయంలో తొక్కిసలాటలో గాయపడిన జెమ్స్‌లో చికిత్స పొందుతున్న తక్షగాత్రులకు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్యే గొండు శంకర్‌లు రూ.3 లక్షలు చొప్పున చెక్కులను అందజేశారు. ప్రభుత్వం నుంచి పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని బాధిత కుటుంబాలకు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో జెసి ఫర్మాన్‌అహ్మద్‌ఖాన్, ఆర్‌డిఒ సాయి ప్రత్యూష, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రవీంద్రనాథ్

పోరాటంతోనే బీమాపై జిఎస్‌టి రద్దు

ఎస్‌సిజెడ్ఐఇఎఫ్ ప్రధాన కార్యదర్శి రవీంద్రనాథ్

ప్రజాశక్తి- పలాస

ఆరోగ్య జీవిత బీమాలపై జిఎస్‌టి రద్దు కోసం ఆందోళన చేపట్టి విజయం సాధించామని ఎస్‌సిజెడ్ఐఇఎఫ్ ప్రధాన కార్యదర్శి రవీంద్రనాథ్ అన్నారు. కాశీబుగ్గ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో విశాఖపట్నం డివిజన్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ (ఐసిఇయు) 51వ మహాసభలు ఆదివారం నిర్వహించారు. జిఎస్‌టి రద్దు చేయడంలో ప్రజలను చైతన్యం చేస్తూ... ఇతర ప్రజా సంఘాల మద్దతుతో పోరాటం చేయడం వల్ల కేంద్ర ప్రభుత్వం దిగి వచ్చిందన్నారు. ఎల్ఐసి ఏటా అద్భుతంగా వ్యాపారాన్ని పెంచుకుంటూ వెళ్తుందన్నారు. బీమా రంగంలో ఎఫ్‌డిఐ 74 శాతం ఉన్నప్పుడే 32 శాతం విదేశీ పెట్టుబడులు ఉన్న తరుణంలో శతశాతం పెంచాలని నిర్ణయించిందన్నారు. ఎఐఐఇఎ మాజీ ప్రధాన కార్యదర్శి కె.వేణుగోపాల్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్ఐసిని ఐదు ముక్కలుగా విభజించాలని ఎంతో ప్రయత్నం చేసిందన్నారు. ఆ సమయంలో సునీల్ మిత్రా ఎంపీగా ఉండడంతో పార్లమెంట్‌లో చర్చ జరపడంతో నిలిచిపోయిందని గుర్తు చేశారు. ఎల్ఐసిపై దాడులు జరగడం కొత్త కాదని, అదే స్థాయిలో దుష్ప్రచారాన్ని తిప్పి కొట్టాలని అన్నారు. పోరాటం చేస్తున్నప్పుడే విజయం సొంతమవుతుందన్నారు. కార్యక్రమంలో ఐసిఇయు కార్యదర్శి వరప్రసాద్, కిషోర్, ఎస్.ప్రసాద్‌దాస్, ధనుంజయరావు, తిరుమలరావు, రాకముందురావు, సిఐటియు ఎన్.గణపతి సుబ్బారావు, ఎల్ఐసి ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

తొక్కిసలాట ఘటనపై కొనసాగుతున్న దర్యాప్తు

- తప్పుడు ప్రచారాలు చేస్తే చర్యలు
- విశాఖ రేంజ్ డిఐజి గోపీనాథ్‌జట్టి

శ్రీకాకుళం: పలాస–కాశీబుగ్గ వెంకటేశ్వర స్వామి ఆలయం లో జరిగిన తొక్కిసలాట ఘటనపై పోలీసులు ఆరా తీస్తూ, కేసు దర్యాప్తు పూర్తి స్థాయిలో కొనసాగుతుం దని విశాఖపట్నం రేంజ్ డిఐజి గోపీనాథ్‌జట్టి తెలిపారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వాస్తవాలు వెలుగులోకి తెచ్చే దిశగా పోలీసులు కృషి చేస్తున్నారని అన్నారు. ఈ ఘటనపై కేసు దర్యాప్తు, సామాజిక మాధ్యమాల్లో కొంతమంది అవాస్తవాలు, అసత్య దుష్ప్రచారాలు చేస్తున్న నేపథ్యంలో ఆదివారం శ్రీకాకుళం జిల్లా పోలీసు కార్యాలయంలో శ్రీకాకుళం ఎస్‌పి కె.వి.మహేశ్వరరెడ్డి, విజయనగరం ఎస్‌పి ఎ.ఆర్.దామోదర్, డిఎస్‌పిలతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సామాజిక మాధ్యమాల్లో అవాస్తవాలు, అసత్య సమాచారం వ్యాప్తి చేయడం చట్టరీత్యా నేరమన్నారు. ఇటువంటి పోస్టులు, వీడియోలు, వ్యాఖ్యలు చేస్తున్న వారి వివరాలు సేకరిస్తున్నామని తెలిపారు. పోస్టులు పెట్టిన వివరాలు, లొకేషన్ ఆధారంగా గుర్తించి అవసరమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు వాస్తవాలను తెలుసుకోకుండా సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని సూచించారు. పోలీసుశాఖ అధికారిక సమాచారం మాత్రమే నమ్మి, శాంతి భద్రతలకు సహకరించాలని సూచించారు. కాశీబుగ్గ తొక్కిసలాట కేసు దర్యాప్తు కొనసాగుతోందన్నారు. పోలీసులు అన్ని కోణాల్లో ఘటనపై విశ్లేషణ చేపట్టి బాధ్యులపై తగిన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

25 నాటికి జాయింట్ ఎల్‌పిఎం సమస్యల పరిష్కారం

శ్రీకాకుళం సిటీ : రీ సర్వేలో భాగంగా నిర్వహిస్తున్న జాయింట్ ఎఎల్‌పిఎం సమస్యల పరిష్కారం ఈ నెల 25 నాటికి పూర్తి చేయాలని సర్వే, ల్యాండ్ రికార్డ్స్ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు సి.హెచ్.వి. ఎస్.ఎన్.కుమార్ ఆదేశించారు. గత రెండు రోజులుగా జిల్లాలో విస్తృతంగా పర్యటించిన ఆయన భూమి రీసర్వే పనుల నాణ్యతను, పురోగతిని జిల్లా పరిషత్ కార్యాలయంలో ఆదివారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రీ సర్వేకు సంబంధించిన అన్ని దశల్లో రికార్డులను సంపూర్ణంగా తనిఖీ చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో నూరు శాతం కచ్చితత్వం సాధించాలని ఆదేశించారు. భూ యజమానులకు భవిష్యత్‌లో ఎటువంటి సమస్యలు రాకుండా సర్వే పనులు నిర్వహించాలన్నారు. మొదటి, రెండు విడతల్లో మిగిలిన పనులను నిర్ణీత గడువు ప్రకారం పూర్తి చేయాలని స్పష్టం చేశారు. సమావేశంలో అత్యంత కీలకమైన అంశం 'జాయింట్ ఉమ్మడి సరిహద్దు సమస్యలు పరిష్కారం'పై దృష్టి సారించారు. ప్రస్తుతం చేపడుతున్న సర్వేలో ఈ సమస్యలు తలెత్తకుండా అదనపు జాగ్రత్తలు తీసుకో వాలని సూచించారు. భూములు సరిహద్దులు నిర్ణ యించే పనినీ ఈ నెల 15 లోగా తప్పనిసరిగా పూర్తి చేయాలని గడువు విధించారు. ఈ సందర్భంగా మండల సర్వేయర్లు అడిగిన సాంకేతిక సందేహాలను నివృత్తి చేస్తూ, సరైన సూచనలు ఇచ్చారు.



సమీక్షిస్తున్న కుమార్

వైభవోపేతంగా తెప్పోత్సవం



ఇంద్రపురష్కరిణిలో ఊరేగిస్తున్న హంస వాహనం

ప్రజాశక్తి- అరసవల్లి

కార్తీక శుద్ధ ద్వాదశి సందర్భంగా అరసవల్లి సూర్యనారాయణస్వామి ఇంద్రపురష్కరణ వద్ద ఆదివారం రాత్రి వైభవోపేతంగా తెపోత్సవం నిర్వహించారు. ముందుగా ఉత్సవమూర్తులు ఉష, పద్మిని, ఛాయా దేవియలకి స్వర్ణ (బంగారు) ఆభరణాలతో ప్రత్యేక అలంకరణతో ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ,, ఆలయ వేద పండితులు స్వామి ఉత్సవమూర్తులను ప్రత్యేక పల్లకిపైన ఆలయం నుంచి కోలాటం, ప్రత్యేక భజన కార్యక్రమాలు, పలు సాంస్కృతిక, నృత్యాలు, మేళతాళాలతో ఇంద్రపుష్కరణ వద్దకు తీసుకొచ్చారు. అనంతరం హంస వాహనంపై ఉంచి స్వామివారిని 12 సార్లు ఇంద్రపుష్కరిణి చుట్టూ హంస వాహనంలో ఊరేగించి స్వామివారిని మాడవీధిల్లో ఊరేగించి తెప్పోత్సవం నిర్వహించారు. డిఎస్‌పి వివేకానంద పర్యవేక్షణలో భారీగా పోలీస్ బందోబస్తు ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఇఒ కె.ఎన్.వి.డి.వి.ప్రసాద్, సబ్ ఇన్‌స్పెక్టర్ వెంకటరావు పాల్గొన్నారు.

ఇదిలా ఉండగా తెప్పోత్సవం ప్రారంభ సమయానికి చిన్న చినుకులతో ప్రారంభమైంది. ఇంద్రపురష్కరణలో హంస వాహనం మూడోసారి తిరిగి వచ్చేసరికి వర్షం పెద్దగా పడడంతో యాత్రికులు ఇబ్బందులు పడ్డారు. 2014లో రథసప్తమి వేడుకలకు ఆలయం ఎదురుగా ఉన్న భవనాలన్నీ కూల్చివేయడంతో యాత్రికులకు సరైన ఏర్పాట్లు కూడా చేయకపోవడంతో అనేక ఇబ్బందులకు గురయ్యారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి ఎండలోనే యాత్రికులు ఇంద్రపుష్కరిణి మెట్ల వద్ద, గోసాల వద్ద బారికేడ్ల పక్కన సుమారు మూడు నాలుగు గంటలపాటు నిల్చొన్నారు. కార్యక్రమం నిర్వహించే సమయంలో వర్షం రావడంతో యాత్రికులు తలదాచుకుందామనే ఉద్దేశంతో పరుగులు తీశారు. అయితే శనివారం కాశీబుగ్గ వెంకటేశ్వరస్వామి ఆలయంలో జరిగిన తొక్కిసలాట దృష్ట్యా పోలీసులు ముందస్తుగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు బందోబస్తు ఏర్పాటు చేశారు.



తరలివచ్చిన యాత్రికులు

వినియోగదారులకు మెరుగైన సేవలు

- రైతులకు పంట రుణాలు
- తక్కువ వడ్డీతో 'సూర్యఘర్'
- డిసిసి బ్యాంకు ముఖ్య కార్యనిర్వహణ అధికారి సత్యనారాయణ





ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

వినియోగదారులకు మెరుగైన సేవలు లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు డిసిసి బ్యాంకు ముఖ్య కార్యనిర్వహణ అధికారి దత్తి సత్యనారాయణ తెలిపారు. లక్ష్యాలు నిర్దేశించుకొని ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. అర్హత ఉన్న రైతులకు పంట రుణాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రాథమిక సహకార సంఘాల ద్వారా మెరుగైన సేవలు అందిస్తున్నామన్నారు. ముఖాముఖిలో భాగంగా 'ప్రజాశక్తి'తో మాట్లాడారు.

? ఇటువంటి సేవలు అందిస్తున్నారు?

జిల్లాలో డిసిసి బ్యాంకు పరిధిలో 25 బ్రాంచ్‌లు ఉన్నాయి. 2025–26 ఆర్థిక సంవత్సరం రూ.3 వేల కోట్ల వ్యాపారం లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం. దాదాపు లక్ష్యాన్ని చేరుకునే దశలో ఉన్నాం. ప్రధానంగా అర్హత గల ప్రతి రైతుకు పంట రుణాలను అందజేస్తున్నాం. మిగతా బ్యాంకులతో పోల్చితే మెరుగ్గా రుణాలు అందజేస్తున్నాం.

? పంట రుణాలు అందజేతలో ఎటువంటి నిబంధనలు పాటిస్తున్నారు?

రైతులకు వారి సాగు భూమి బట్టి, సాగు చేస్తున్న పంట బట్టి రుణాల అందజేస్తున్నాం. నేరుగా రైతులు ఖాతాల్లో రుణాలు జమసేస్తున్నాం. త్వరితగతిన రుణాలు అందజేయడం, సకాలంలో రెన్యువల్ చేయడం చేస్తున్నాం. నిబంధలు మేరకు జాప్యం లేకుండా రుణాలు అందజేస్తున్నాం. గ్రామీణ ప్రాంత రైతులు ఎక్కువగా డిసిసి బ్యాంకు నుంచి రుణాలు తీసుకుంటున్నారు. గ్రామాల్లో పంట రుణాలపై ప్రచారం సైతం నిర్వహిస్తున్నాం.

? మిగతా బ్యాంకుతో పోల్చితే ప్రత్యేకత ఏమిటి?

పంట రుణాలు తక్కువ వడ్డీ రేట్లుకు మిగతా బ్యాంకులతో పోలిస్తే అందజేస్తున్నాం. సీనియర్ సిటిజన్ ఖాతాలకు గరిష్టంగా 0.60 అదనంగా వడ్డీ చెల్లిస్తున్నాం. చాలామంది ఈ సేవలను సద్వినియోగం చేసుకుంటున్నారు. సీనియర్ సిటిజన్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

? ఇతర రుణ సదుపాయాలు ఎలా అందజేస్తున్నారు?

ప్రభుత్వ పథకాలకు లోబడి రుణాలు అందజేస్తున్నాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ప్రధానమంత్రి సూర్యఘర్, పిఎంఇజిపి, పిఎం స్వానిధి, పిఎంఎఫ్‌ఎం వంటి పథకాలకు తక్కువ వడ్డీ రేట్లు రుణాలు అందజేస్తున్నాం. స్వయం సహాయ సంఘాలకు, చిరు వ్యాపారులకు, చిన్న తరహా పరిశ్రమలు ఏర్పాటుకు రుణాలు మంజూరు చేస్తున్నాం. బంగారం ఆభరణాలపై రుణాలు అందజేయటంతో పాటు, బ్యాంకు బ్రాంచ్‌లో లాకర్ సదుపాయం వంటివి కల్పిస్తున్నాం. ప్రభుత్వ నిబంధనలు మేరకు ఎటువంటి హామీ లేకుండా సైతం కొన్ని పథకాలకు రుణాలు అందజేస్తున్నాం.

? డిసిసి బ్యాంకు ఇతర సేవలు ఎలా ఉంటాయి?

ప్రాథమిక సహకార సంఘాల ద్వారా ప్రధానంగా వ్యవసాయ రంగంతో పాటు చేనేత, మత్స్య, గొర్రెల పెంపకం వంటి వాటిని ప్రోత్సహిస్తూ రుణాలు మంజూరు చేస్తాం. వ్యవసాయ అనుబంధ రంగాలు బలోపేత లక్ష్యంగా ముందుకు సాగుతాం. గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన సేవలు అందించడం లక్ష్యం. మిగతా బ్యాంకులతో పోల్చితే సేవలు మెరుగ్గా ఉంటాయి. తక్కువ వడ్డీకి స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక రుణాలు అందజేసే చర్యలు చేపడుతున్నాం. గ్రామీణ ప్రాంత ప్రగతికి కృషి చేస్తున్నాం. వ్యవసాయ, ఆధారిత రంగాలు బలోపేతం లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం.

ప్రభుత్వమే బాధ్యత వహించాలి

ఐద్వా జిల్లా కన్వీనర్ అల్లాడ లక్ష్మి


క్షతగాత్రులను పరామర్శిస్తున్న ఐద్వా నాయకులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం రూరల్

కాశీబుగ్గలో వెంకటేశ్వర ఆలయంలో శనివారం జరిగిన దుర్ఘటన ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం జిల్లా కమిటీ అభిప్రాయ పడింది. ఈ ఘటనలో మృతి చెందిన వారికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నామని ఐద్వా జిల్లా కన్వీనర్ అల్లాడ లక్ష్మి అన్నారు. రాగోలు జెమ్స్ ఆస్పత్రిలో వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్న క్షతగాత్రులను కుమారి, కళావతి, అమ్మమ్మలను ఐద్వా బృందం పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆలయ నిర్వాహణ కమిటీ, ఇటు కూటమి ప్రభుత్వం జరిగిన సంఘటనకు బాధ్యత వహించాలన్నారు. చిన్న తిరుపతంటూ తీవ్ర ప్రచారం చేసి 9 మంది మృతికి కారకులైన వారిని ప్రభుత్వం శిక్షించాలన్నారు. ఈ ఆలయాన్ని ఎండోమెంట్ పరిధిలో లేదని, ఇది ప్రైవేటు కార్యక్రమని చేతులు దులుపుకోవడం బాధ్యతారాహిత్యమని పేర్కొన్నారు. క్షతగాత్రులను సందర్శించిన వారిలో టి.ప్రవీణ, డి.సూర్యమ్మ, పి.శ్రీదేవి. ఎం.లక్ష్మి ఉన్నారు.


మాట్లాడుతున్న గిరిధర్

రేపు మండల స్థాయి సైన్స్ సంబరాలు

ప్రజాశక్తి - అరసవల్లి

ఈ నెల 4న మండలస్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహిస్తున్నట్లు జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గొంటి గిరిధర్, కుప్పిలి కామేశ్వరరావు, చెకుముకి జిల్లా కన్వీనర్ పాలకొండ కూర్మారావు, రాష్ట్ర సభ్యులు ఎస్.సాయి శ్రీనివాస శర్మ, జిల్లా కో- కన్వీనర్ పూజారి గోవిందరావు తెలిపారు. పాఠశాల స్థాయిలో జిల్లాలో 25 వేల మంది విద్యార్థులు, వందలాది మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. 355 ప్రభుత్వ పాఠశాలలు, 45 ప్రైవేట్ పాఠశాలల నుంచి 476 టీమ్‌లతో 1428 మంది విద్యార్థులు 30 మండలాల్లో మండల స్థాయి చెకుముకి సైన్స్ సంబరాల్లో పాల్గొంటున్నారని తెలిపారు. పాఠశాల స్థాయిలో విజేతలైన టీమ్‌లు నవంబర్ 4న మండలాల్లో జరిగే చెకుముకి సైన్స్ సంబరాల్లో పాల్గొనాలని గొంటి గిరిధర్ విజ్ఞప్తి చేశారు. ఈ సైన్సు సంబరాల్లో మండల విద్యాశాఖ అధికారులు, హెచ్‌ఎంలు, చెకుముకి కన్వీనర్లు, సైన్స్ ఉపాధ్యాయులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.


సామగ్రి అందజేస్తున్న అన్వేష్

ఘనంగా సండే స్కూల్ దినోత్సవం

ఇచ్ఛాపురం : మండలంలోని ఈదుపురం, డొంకూరు, రక్తకన్న చర్చిల్లో అంతర్జాతీయ సండే స్కూల్ దినోత్సవం ఆదివారం నిర్వహించారు. ఆంధ్రా బాప్టిస్ట్ చర్చ ప్రెసిడెంట్ ప్రత్తి విజయ్ కుమార్ ఆధ్వర్యాన క్రిస్టియన్ మైనారిటీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ప్రత్తి అన్వేష్ 350 మంది పిల్లలకు పెన్నులు, పెన్సిళ్ళు, పరీక్ష అట్టలు పంపిణీ చేశారు. మండపల్లి ఆంధ్రా బాప్టిస్ట్ చర్చిలో పాస్టర్ ఆర్.ప్రకాశరావు, భాస్కరరావులు కూడా పిల్లలకు అట్టలు, పెన్నులు పంపిణీ చేశారు.

రూ.25 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి

ప్రజాశక్తి - కవిటి


కిరణ్ కుమార్

కాశీబుగ్గలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం జరిగిన తొక్కిసలాట ఘటనపై జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు డాక్టర్ పూడి కిరణ్ కుమార్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలకు రూ.25 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని కోరారు. ఇలాంటి దుర్ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. గాయపడిన వారికి ఉత్తమ వైద్య సదుపాయాలు కల్పించాలని కోరారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్


ట్రాక్టర్‌ను సీజ్ చేసిన తహశీల్దార్ వెంకటరావు

ఇచ్ఛాపురం : మండలంలో బాహుదా నదిలో వంతెన వద్ద అక్రమంగా ఇసుక తవ్వకాలు చేపడుతున్నారు. విషయం తెలుసుకున్న తహశీల్దార వెంకటరావు ఆదివారం ఆకస్మిక దాడులు చేపట్టి ట్రాక్టర్‌ను సీజ్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాహుదా వంతకు 500 మీటర్ల వరకు నిషేధాజ్ఞలు ఉండడంతో దాడులు నిర్వహించామన్నారు. అక్రమ ఇసుక తవ్వకాలు, రవాణాపై పోలీస్, ఎంపిడిఒతో కలిసి సమన్వయ సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రాత్రి వేళలో అక్రమ ఇసుక తవ్వకాలు, రవాణాపై నిఘా పెట్టడానికి సిబ్బంది కొరత ఉందని అన్నారు. అదనపు పోలీస్ సిబ్బందిని ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులకు లేఖ రాశామని తెలిపారు.

కురిసిన వర్షం

శ్రీకాకుళం సిటీ: జిల్లాలో కొన్ని చోట్ల ఆదివారం సాయంత్రం వర్షం కురిసింది. అకాలంగా వర్షం పడింది. గత కొన్ని రోజులుగా మొంథా తుపానుతో విస్తారంగా వర్షాలు కురవగా, అకాల వర్షం రైతులను ఆందోళనకు గురిచేసింది. కొన్నిచోట్ల గంట పాటు వర్షం కురిసింది. ప్రారంభంలో మెరుపులు, ఉరుములు, గాలులతో ప్రారంభమైంది. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది.

యువత సన్మార్గంలో నడవాలి

టెక్కలి : యువత సన్మార్గంలో నడవాలని సీనియర్ న్యాయవాది చంద్రశేఖర పట్నాయక్ అన్నారు. టెక్కలి డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో సన్యాసినీలాపురం, డమర గ్రామాల్లో ఆదివారం నిర్వహించిన జాతీయ సేవా శిబిరంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మత్తు పదార్థాలకు బానిస కావడం వల్ల జరిగే నష్టాలను వివరించారు. కార్యక్రమంలో జాతీయ సేవా విభాగం పిఒలు డి.వాసుబాబు, వి.లుక్‌పాల్ పాల్గొన్నారు.


రక్షణ చర్యల్లో పాల్గొంటున్న మెరైన్ పోలీసులు

భావనపాడు బీచ్‌లో బందోబస్తు

సంతబొమ్మాళి మండలంలోని భావనపాడు సముద్ర తీరంలో ఆదివారం భారీ జనసందోహం కనిపించింది. వనభోజనాల (పిక్నిక్) సందర్భంగా టెక్కలి, నరసన్నపేట, పర్లాకిమిడి, పాతపట్నం తదితర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు బీచ్‌కు తరలివచ్చారు. ఈ నేపథ్యంలో మెరైన్ సిఐ రాము, ఎస్ఐ శ్రీనివాసరావు ఆధ్వర్యాన పోలీసులు రక్షణ చర్యలు ఏర్పాటు చేశారు. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేనందున ఎవరూ సముద్రం లోకి దిగి స్నానం చేయవద్దని మెరైన్ పోలీసులు పర్యాటకులకు హెచ్చరికలు జారీ చేసి అవగాహన కల్పించారు.


పుష్పను పరామర్శిస్తున్న అధికారులు

అధికారుల పరామర్శ

మెళియాపుట్టి : కాశీబుగ్గ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం తొక్కిసలాటలో మండలంలోని చిన్నహంసకు చెందిన ఎం.పుష్ప గాయపడింది. ఆమెను ప్రస్తుతం పలాస ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతుంది. ఎంపిడిఒ నరసింహ ప్రసాద్ పండా, తహశీల్దార్ బడే పాపారావు ఆస్పత్రికి వెళ్లి ఆమెను పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి అవసరమైన సహాయం అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో పిఆర్ వర్క్ ఇన్‌స్పెక్టర్ చిన్నారావు, విఆర్ఒ నీలయ్య పాల్గొన్నారు.

నేడు వాహనాల వేలం పాట

టెక్కలి రూరల్ : టెక్కలి ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ కార్యాలయం వద్ద వివిధ నేరాల్లో పట్టుబడిన మూడు ద్విచక్ర వాహనాలు, ఆటోకు సోమవారం వేలం వేస్తున్నట్లు టెక్కలి ఎక్సైజ్ సిఐ షేక్ మీరా సాహెబ్ ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనదలచిన ఔత్సాహికులు దరఖాస్తు రుసుం రూ.వెయ్యి చెల్లించి వేలం పాటలో పాల్గొనవచ్చు అన్నారు. వేలం పాట అనంతరం దరఖాస్తు రుసుం తిరిగి వాపసు ఇస్తామన్నారు. వేలంపాట దారులు ప్రభుత్వం ప్రకటించిన కనీసపు ధర కంటే ఎక్కువగా వేలం పాట పాడాలని తెలిపారు. వాహనాలు దక్కించుకోనున్న పాటదారుడు పాడిన పాట రుసుంకు అదనంగా జిఎస్‌టి కలిపి మొత్తం రుసుం వెంటనే కార్యాలయంలో చెల్లించాలన్నారు. తదుపరి సమాచాచానికి టెక్కలి ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు.

శవ రాజకీయాలు మానుకోవాలి

ప్రభుత్వ విప్ అశోక్


మాట్లాడుతున్న విప్ అశోక్

ప్రజాశక్తి - కవిటి

కాశీబుగ్గ వెంకటేశ్వరస్వామి ఆలయంలో జరిగిన తొక్కిసలాటలో 9 మంది ప్రాణాలు కోల్పోవడం దురదృష్టకరమని, కానీ, ఆ విషాదాన్ని రాజకీయ ప్రయోజనాలకు వాడుకోవడం సిగ్గుచేటని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ తీవ్రంగా మండిపడ్డారు. మండలంలోని రామయ్యపుట్టుగలోని క్యాంపు కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. 'వైసిపి నాయకులు ఇకనైనా శవ రాజకీయాలు మానుకోవాలి' అని హితవుపలికారు. పూర్తిగా ప్రైవేటు యాజమాన్యంలో నడుస్తున్న ఆలయంలో 2 వేల మందికి మాత్రమే సామర్థ్యం ఉండగా, 20 వేల మంది గుమికూడడంతో తొక్కిసలాట జరిగినట్టు ప్రాథమికంగా నిర్ధారించారని అన్నారు. దానికి ప్రభుత్వాన్ని కారణం చేస్తున్న వైసిపి నాయకుల హడావుడిని ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. ఘటన జరిగిన వెంటనే ప్రభుత్వం స్పందించి అవసరమైన ఏర్పాట్లు చేసిందని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర మంత్రులు వెంటనే సంఘటనా స్థలానికి వెళ్లి బాధిత కుటుంబాలకు అండగా నిలిచారని తెలిపారు. అలాంటి పరిస్థితుల్లో ఓ అంబులెన్స్‌లో ఫొటో ఉన్నట్టు చేస్తూ ప్రభుత్వాన్ని విమర్శించడం మాజీ మంత్రి అప్పలరాజు విజ్ఞతకు నిదర్శనమని ఎద్దేవా చేశారు. ఆలయ ధర్మకర్తే ఎవరికీ సమాచారం ఇవ్వలేదని చెబుతుంటే, వైసిపి నాయకులు మాత్రం ప్రభుత్వాన్ని తప్పుపడుతూ గొంతు చించుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తుపానులో శవాలు దొరక్కపోయేసరికి మతిభ్రమించిన వైసిపి నాయకులు ఈ ఘటనను కూడా రాజకీయాలకు వాడుకోవడం దారుణమని అన్నారు. కార్యక్రమంలో కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ బార్ల చినబాబు, ఎఎంసి చైర్మన్ మణిచంద్ర ప్రకాష్, పిఎసిఎస్ అధ్యక్షుడు ఎర్ర బాసుదేవ్ ప్రధాన్, టిడిపి మండల అధ్యక్షుడు పొందర కృష్ణారావు, నాయకులు సదానంద రౌళో, సీపాన వెంకటరమణ, బెందాళం రమేష్, బాసుదేవ్ రౌళో, సిందుల గున్నయ్య, పుల్లల సంతోష్ పాల్గొన్నారు.

ఆమదాలవలస: కాశీబుగ్గలోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం జరిగిన తొక్కిసలాట దురదృష్టకరమని దర్శనం కోసం వచ్చిన యాత్రికులు ప్రాణాలు కోల్పోవ డం తీవ్ర బాధాకరమని ఎమ్మెల్యే కూన రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఘటన జరిగిన వెంటనే ప్రభుత్వం స్పందించి క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి రెస్క్యూ, ఎన్‌డిఆర్‌ఎఫ్, మంత్రులు, సిఎం ఆదేశాలతో సహాయక చర్యలు చేపట్టడం జరిగింద న్నారు. తక్షణమే స్పందించిన ప్రభుత్వంపై కొంత మంది వైసిపి నాయకులు విమర్శించడం సిగ్గుచేటన్నారు.

రీసర్వేతో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం


రీసర్వేను పరిశీలిస్తున్న అధికారులు

ప్రజాశక్తి - రణస్థలం

రీ సర్వేతో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చేయాలని రీజనల్ జాయింట్ డైరెక్టర్ ఆఫ్ సర్వే సి.హెచ్.వి.ఎస్.ఎన్. కుమార్ అన్నారు. మండలంలోని నారాయణపట్నంలో జరుగుతున్న రీ సర్వే కార్యక్రమాన్ని ఆదివారం పరిశీలించారు. రీ సర్వేలో భాగంగా ర్యాలీ నిర్వహించి, గ్రామసభ నిర్వహించారు. రీసర్వే ఎలా జరుగుతుందని రైతులను అడిగి తెలుసు కున్నారు. రీసర్వే అమలు జరుగుతున్న తీరుపై మండల సర్వేయర్, ఉప తహశీల్దార్ (రీ సర్వే), సచివాలయ సర్వేయర్లు, విఆర్ఒలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రీ సర్వేకు రైతులందరూ సహకారం అందించాలని, ఎవరికైనా సమస్యలు ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు రావాలన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక టెక్నాలజీతో రాష్ట్ర వ్యాప్తంగా భూములకు రీసర్వే చేపడుతున్నారని, రాష్ట్రంలోని అన్ని భూములకు రీసర్వే పూర్తి చేయనున్నట్లు చెప్పారు. సర్వే చేసిన భూముల రికార్డుల ఆధారంగా భూమిహక్కులు ప్రభు త్వమే కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ సనపల కిరణ్ కుమార్, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కళాకారుల ఆడిటోరియం నిర్మించాలి


మాట్లాడుతున్న కళాకారుల సంఘం అధ్యక్షుడు ధనుంజయరావు

ప్రజాశక్తి - ఆమదాలవలస

కళాకారుల ఆడిటోరియానికి స్థలం మంజూరు చేయాలని కళాకారుల సంఘం అధ్యక్షులు పేడాడ ధనుంజయరావు ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం మండల పరిధిలోని గాజుల కొల్లివలస వద్ద నున్న సంగమేశ్వర స్వామి ఆలయం వద్ద కళాకారుల కార్తీకమాస వన భోజనాలను కళాకారుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాకారుల సమస్యలపై ప్రభుత్వం స్పందించి వారిని ఆదుకోవాలని కోరారు. ఈ సభకు హాజరైన పలువురు ముఖ్యఅతిధులు ప్రభుత్వం ఆడిటోరియానికి స్థలాన్ని మంజూరు చేస్తే దాని నిర్మాణానికి తమవంతు సహకారం అందిస్తామని ప్రకటించారు. అనంతరం మహిళా కళాకారులకు చీరలను పంపిణీ చేశారు. పేద కళాకారులకు ప్రతినెల రూ.200 ఆర్థికసాయాన్ని అందజేస్తామని కళాకారుల సంఘం తెలిపింది. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ముఖ్య అతిధులుగా జె.జె మోహనరావు, సనపల అన్నాజీరావు, ఖండాపు గోవిందరావు, తమ్మన రామకృష్ణ, పైడి సూర్యారావు, పేడాడ వెంకట సూర్యనారాయణ, బొడ్డేపల్లి జోగారావు, గురుగుబిల్లి గోవిందరావు హాజరయ్యారు. సమావేశంలో కళాకారుల సంఘం ప్రధాన కార్యదర్శి బగాది తేజేశ్వరరావు, సహాధ్యక్షులు బొడ్డేపల్లి జనార్ధనరావు, గౌరవ అధ్యక్షులు టేకి త్రినాధరావు, సంయుక్త కార్యదర్శి మోబగాపు ఈశ్వరరావు, కోశాధికారి కొంచాడ రామారావు, పివిఎన్ మాస్టారు, ఎన్.చంద్రశేఖరరావు తదితరులు పాల్గొన్నారు.


శివాజీ మృతదేహం

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి - కవిటి

మండలంలోని జగతి గ్రామం మలుపు వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందినట్లు ఎస్ఐ రవివర్మ తెలిపారు. ఎస్ఐ అందించిన సమాచారం మేరకు విజయనగరం జిల్లా దత్తిరాజు మండలం పెద్దమానాపురానికి చెందిన గొట్టివాడ శివాజీ (25) వృత్తిరీత్యా కవిటి వచ్చి జగతి గ్రామ సమీపంలో మలుపు వద్ద బండి అదుపు తప్పడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ప్రమాదంలో తలకు బలమైన గాయాలు కావడంతో శివాజీ మృతి చెందాడు. మృతుని బాబాయ్ గొట్టివాడ చిన్నయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు హెచ్‌సి ప్రకాశరావు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రవివర్మ తెలిపారు.


ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయిస్తున్న మురళీమోహన్

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

లావేరు: మండలంలోని తాళ్లవలస గ్రామంలోని దళితవాడలో గృహావసరాలకు విద్యుత్ సరఫరా చేసే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కొత్తది ఏర్పాటు చేశారు. ఇటీవల ట్రాన్స్‌ఫార్మర్ పాడవ్వడంతో గృహాలకు విద్యుత్ సరఫరా కాకపోవడంతో దళితవాడ వాసులు టిడిపి మండల అధ్యక్షులు ముప్పిడి సురేష్ దృష్టికి సమస్యను తీసుకువెళ్లడంతో వెంటనే ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను తెప్పించారు. అనంతరం మాజీ సర్పంచ్ ముప్పిడి మురళీమోహన్ దగ్గరుండి కొత్త విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్‌ను ఏర్పాటు చేయించడంతో కాలనీవాసులు ముప్పిడి సోదరులకు కృతజ్ఞతలు తెలిపారు.

సేవలే గుర్తింపునిస్తాయి

టెక్కలి : సమాజంలో ఉపాధ్యాయునిగా విద్యార్థులకు సమాజానికి మనం చేసిన సేవలు గుర్తింపునిస్తాయని టెక్కలి డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి విలియమ్స్ అన్నారు. మండలంలోని రావివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సాంఘికశాస్త్ర ఉపాధ్యాయునిగా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ గావించిన తాళభద్ర ధర్మారావు సత్కార సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ధర్మారావు సేవలను పలువురు అభినందించారు. ఎంఇఒ దల్లి తులసీరావ ్రెడ్డి, దాసుపురం చిన్నారావు, మల్లారెడ్డి పద్మనాభం, యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు కురమాన దాలయ్య, ప్రధానోపాధ్యాయులు ఎన్. భారతి, చిలుకు కృష్ణారావు, యు.గణపతి, జనవిజ్ఞాన వేదిక నాయకులు కుప్పిలి కామేశ్వరరావు, పాలవలస ధర్మారావు పాల్గొన్నారు.

నలుగురు అరెస్టు

పర్లాకిమిడి : గజపతి జిల్లా కాశీనగర్ సమితి కార్యాలయానికి సమీపంలో ఉన్న ఒక లాడ్జిపై పోలీసులు దాడి చేసి వ్యభిచార నేరంపై ఇరువురు మహిళలను, ఇరువురు పురుషులను అదుపులోకి తీసుకొన్నారు. అదుపులోకి తీసుకొన్న కౌన్సెలింగ్ నిర్వహించి పంపిస్తామని కాశీనగర్త ఐఐసి బెహరా తెలిపారు. ఇరువురు పురుషులు, వ్యభిచారం నడిపిస్తున్నట్లు మరో ఇద్దరిపై కేసు నమోదు చేశామన్నారు.

ఎర్రన్నాయుడు ఆశయసాధనకు కృషి

కేంద్ర, రాష్ట్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, అచ్చెన్నాయుడు


ఎర్రన్నాయుడు ఘూట్‌వద్ద నివాళ్లర్పిస్తున్న రామ్మోహన్ నాయుడు, అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - కోటబొమ్మాళి

కీర్తిశేషులు కింజరాపు ఎర్రన్నాయుడు ఆశయసాధన కోసం కృషి చేస్తామని కేంద్ర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. ఎర్రన్నాయుడు 13వ వర్ధంతి సందర్భంగా ఆదివారం నిమ్మాడలో ఎర్రన్న ఘూట్‌వద్ద మంత్రులతోపాటు పలువురు ఎమ్మెల్యేలు, కుటుంబ సభ్యులు నివాళ్లర్పించారు. కార్యక్రమంలో విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎర్రన్న సోదరులు, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరిప్రసాద్, ప్రభాకర్, మాజీ మంత్రి గౌతుశ్యాంసుందర్ శివాజీ, ఎమ్మెల్యే బంగారు సత్యన్నారాయణమూర్తి, మాజీ శాసన మండలి సభ్యులు విశ్వప్రసాద్, చౌదరి నారాయణమూర్తి పాల్గొన్నారు. హరిశ్చంద్రపురంలో ఎర్రన్న విగ్రహానికి మాజీ సర్పంచ్ పూజారి శైలజాసత్యనారాయణ, కోటబొమ్మాళిలో ఎర్రన్నాయుడు పార్కు, మండల పరిషత్ కార్యాలయంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి బోయిన గోవిందరాజులు, టిడిపి మండల అధ్యక్షుడు బోయిన రమేష్, కోరాడ గోవిందరావు, బాడాన రవణమ్మ పాల్గొన్నారు.

నరసన్నపేట : పట్టణంలో జుట్టు కళాసీ యూనియన్ ఆవరణంలో, మార్కెట్ వీధిలో, టిడిపి కార్యాలయంలో కేంద్ర మాజీమంత్రి ఎర్రన్నాయుడు విగ్రహానికి, చిత్రపటానికి ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.

మెళియాపుట్టి : మండలంలోని కొసమాలలో ఎర్రన్నాయుడు విగ్రహానికి పిఎసిఎస్ అధ్యక్షులు సలాన మోహనరావు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో గౌడ్ కార్పొరేషన్ డైరెక్టర్ భాస్కర్‌గౌడ, టిడిపి మండల అధ్యక్షులు నంబాల వెంకటరావు, ప్రధాన కార్యదర్శి బొచ్చు ప్రసాదరావు, సవ్వల గణపతిరావు, బసవ పరమేశ్వర్‌రెడ్డి, భైరిసింగి దినకర్, కదంబల పైడిరాజు, చాపర మాధవరావు, బూర్ల లలిత కుమారి, పడాల శ్రీను పాల్గొన్నారు.

కవిటి: కవిటి బస్టాండ్ కూడలిలోని ఎర్రన్నాయుడు విగ్రహానికి కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ బార్ల చినబాబు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ మణిచంద్ర ప్రకాష్, పిఎసిఎస్ అధ్యక్షుడు ఎర్ర బాసుదేవ్ ప్రధాన్, జడ్ఆర్‌యుసి మెంబర్ శ్రీనివాసరౌళో, టిడిపి మండల అధ్యక్షుడు పొందల కృష్ణారావు పాల్గొన్నారు.

అలాగే మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ త్రినాథ్, ఎంఇఒ ధనుంజయ మజ్జి ఎర్రన్నాయుడు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ శ్రీధర్, జీవన్‌కుమార్, ఉపాధ్యాయులు హిమకుమార్, గుడియా వంశీ పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : స్థానిక బస్టాండ్, మార్కెట్ కూడలిలో ఎర్రన్నాయుడు విగ్రహానికి టిడిపి నాయకులు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు లోపింటి పద్మనాభం, నందిగాం కోటి, సాలీన ఢిల్లీ, లీలారాణి, నందికి జాని, కొండ శంకర్‌రెడ్డి, డి.కామేశ్వరరావు, దట్టి శ్రీను, దుర్యోధన పాల్గొన్నారు.

పోలాకి: మండలంలోని చెల్లాయివలస కూడలి వద్ద ఉన్న ఎర్రన్నాయుడు విగ్రహానికి టిడిపి మండల అధ్యక్షులు ఎం.వెంకట అప్పలనాయుడు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ భైరి భాస్కరరావు, కిల్లి వేణు, ఇలపండ ధర్మారావు, మెట్ట వైకుంఠరావు, మైలపల్లి త్రినాథరావు పాల్గొన్నారు.

నందిగాం : నందిగాం టిడిపి కార్యాలయంలో ఎర్రన్నాయుడు చిత్రపటానికి మండల అధ్యక్షులు పి.అజయ్‌కుమార్ పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పి.చంద్రశేఖరరావు, ఎం.బాలకృష్ణ, కె.సతీష్, ఎ.కూర్మారావు పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : మండలంలో భగవాన్‌పురంలో టిడిపి మండల మహిళా అధ్యక్షులు మెండ దమయంతి ఎర్రన్నాయుడు విగ్రహానికి పూలమాలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ పొన్నాడ సుకన్య, రాజారావు, తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరు : మండలంలోని మాతలలో ఉన్న ఎర్రన్నాయుడు విగ్రహానికి ఎమ్మెల్యే మామిడి గోవిందరావు, టిడిపి జిల్లా పార్లమెంట్ అధ్యక్షులు కలమట వెంకటరమణమూర్తి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు, టిడిపి మండల అధ్యక్షుడు అగతముడి మాధవరావు, పిఎసిఎస్ అధ్యక్షులు మాతల గాంధీ, టిడిపి నాయకులు అగతముడి అరుణ్‌కుమార్, లోతుగెడ్డ లక్ష్మీనారాయణ, కె.సంజీవరావు, శ్రీనివాసరావు, ఎంపిటిసిలు వీర్రాజు, గౌరి పాల్గొన్నారు.

సంతబొమ్మాళి: మండల కేంద్రంలోని, నౌపడలో సుగ్గు శాంతి స్వరూపరెడ్డి, మూలపేటలో కోట నారంనాయుడు ఆధ్వర్యంలో ఎర్రన్నాయుడు వర్ధంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు జీరు భీమారావు, కార్యదర్శి రెడ్డి అప్పన్న, పిఎసిఎస్ చైర్మన్ కూచెట్టి కాంతారావు, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు అట్టాడ రాంప్రసాద్ పాల్గొన్నారు.

రణస్థలం: దివంగత కేంద్రమంత్రి స్వర్గీయ కింజరాపు ఎర్రన్నాయుడు 13వ వర్ధంతి సందర్భంగా విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, తేజబాబు, ఎచ్చెర్ల నియోజకవర్గం ముఖ్య నాయకులతో కలిసి రణస్థలం హెడ్‌క్వార్టర్‌లో సూర్య పబ్లిక్ స్కూల్ వద్ద ఉన్న కింజరాపు ఎర్రన్నాయుడు విగ్రహానికి ఆదివారం పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.

శ్రీకాకుళం సిటీ: కింజరాపు ఎర్రన్నాయుడు 13వ వర్ధంతి సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో శ్రీకాకుళం ఒన్ టౌన్ సిఐ కె.పైడిపు నాయుడు నివాళ్లర్పించారు. యర్రన్న చిత్ర పటానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో టూ టౌన్ సిఐ పి.ఈశ్వరరావు, అర్ఐ కె.నర్సింగరావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న క్షతగాత్రులు


చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

ప్రజాశక్తి - పలాస

కాశీబుగ్గ వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద శనివారం జరిగిన తొక్కిసలాట ఘటనలో క్షతగాత్రులకు వైద్య సేవలు అందుతున్నాయి. ఘటన జరిగిన సమయంలో 18 మంది క్షతగాత్రులు ఉన్నారు. ఆదివారం ప్రస్తుతం 12 మంది చికిత్స పొందుతున్నారు. అందులో భాగంగా టెక్కలి మండలం తెలినీలాపురానికి చెందిన ఆర్.రమాదేవికు కుడి కాలు విరిగిపోయింది. మందస మండలం సరియాపల్లికి చెందిన సిహెచ్.కాంతమ్మకు రెండు కాళ్లు విరిగిపోయాయి. వజ్రపుకొత్తూరు మండలం ధర్మపురానికి చెందిన ఆర్.హరికృష్ణకు కుడి కాలు విరిగిపోగా, అదే మండలం శివరాంపురానికి చెందిన డి.కాంతమ్మ నడుంపై తీవ్ర గాయమైంది. టెక్కలి మండలం రామేశ్వరానికి చెందిన పి.నాగమ్మకు ఎడమ కాలు విరిగిపోయింది. నందిగాంకు చెందిన జి.చిట్టెమ్మకు కుడి కాలు కుడి చేయి విరిగి పోగా, మెళియాపుట్టి మండలం చినహంసకు చెందిన బి.పుష్పకు కుడి కాలు విరిగిపోయింది. వైద్యులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తూ వైద్య సేవలు అందిస్తున్నారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ రాత్రి, పగలు తేడా లేకుండా ఆస్పత్రి వైద్యులతో మాట్లాడం, వీడియో, టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి క్షతగాత్రుల పరిస్థితిపై ఆరా తీస్తున్నారు. ఎప్పుడు ఏ అవసరం వచ్చినా తక్షణమే తనకు సమాచారం ఇవ్వాలని వైద్యులను ఆదేశాలు జారీ చేసినట్లు వైద్య సిబ్బంది తెలిపారు.

ఆలయ నిర్వాహకులు ముందుగా సమాచారమివ్వాలి


ఆలయ నిర్వాహకులతో మాట్లాడుతున్న తహశీల్దార్

ప్రజాశక్తి - రణస్థలం

ప్రజా భద్రత కోసం ఆలయాల్లో భారీగా భక్తులు తరలివచ్చే సందర్భాల్లో, అగ్ని ప్రమాదాలు, తొక్కిసలాటలు వంటి ప్రమాదాలను నివారించడానికి అధికారులకు ముందుగా సమాచారం ఇవ్వాలని, ఉత్సవాల సమయంలో జనసమూహాన్ని నియంత్రించడానికి ముందుగా పోలీసులకు, రెవెన్యూ అధికారులకు, అగ్నిమాపక శాఖలకు సమాచారం ఇస్తే తద్వారా ఎటువంటి ప్రమాదాలు జరగకుండా ముందుగానే తగిన చర్యలు తీసుకోవడానికి వీలవుతుందని తహశీల్దార్ సనపల కిరణ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని బంటుపల్లిలో ఉన్న రాధాగోవింద మందిరం, జగన్నాథ మందిరం, కోష్ట గ్రామంలోని వైద్యనాథేశ్వర దేవాలయాలను ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్తీక మాసంతో పాటు ప్రతీ సంవత్సరం పెద్దఎత్తున ప్రజలు హాజరయ్యే ఉత్సవాలకు సంబంధించిన సమాచారాన్ని ముందుగానే స్థానిక రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపక శాఖల వారికి తెలియజేయాలని, యాత్రికులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు.

ఆదిత్యుని దర్శనానికి పోటెత్తిన యాత్రికులు


క్యూలైన్‌లో రద్దీగా ఉన్న యాత్రికులు

ప్రజాశక్తి - అరసవల్లి

అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి ఆలయంలో కార్తీక రెండవ ఆదివారం సందర్భంగా ఆదిత్య దర్శనానికి యాత్రికులు పోటెత్తారు. ఈ సందర్భంగా ఆలయ సిబ్బంది యాత్రికులకు సౌకర్యాలు కల్పించడంలో విఫలమయ్యారు. ఉచిత దర్శనాల క్యూలైన్ల దగ్గర టెంట్లు వేయకపోవడంతో యాత్రికులు గంటల కొద్దీ ఎండలోనే ఉండి ఇబ్బందులకు గురి కావాల్సి వచ్చింది. కేశఖండన శాల వద్ద కూడా ఆరకొర సౌకర్యాలతో యాత్రికులు ఇబ్బంది పడ్డారు. టిక్కెట్లు తీసుకొని వెళ్లేవారి కంటే విఐపి పేరు చెప్పి చాలామంది నేరుగా దర్శనాలకు వెళ్లడం, పోలీసులు వారి బంధువులను ఎక్కువగా దర్శనాలకు తీసుకొని వెళ్లడం కనిపించింది. సాధారణ భక్తులు దర్శనానికి అవస్థలు పడ్డారు. ఆరకొర సౌకర్యాలతో ఎండలో క్యూలైన్‌లో నిల్చొని అనేక ఇబ్బందులు పడుతూ దర్శనాలకు వెళ్లాల్సి వచ్చింది.

బంగారు అభరణాలు వితరణ

శ్రీ సూర్యనారాయణ స్వామికి నగరానికి చెందిన పొడుగు వెంకట సూర్య ప్రభాకర రావు, వెంకటరాజేష్ కన్నా, కరుణాకర్ ముగ్గురు అన్నదమ్ములు కలిసి 29.820 మిల్లీ గ్రాముల శతమానంతో కూడిన మూడు పుస్తెల తాళ్ల ఆలయానికి అందజేశారు. ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర శర్మ, ఆలయ ఇఒ కెఎన్‌విడివి ప్రసాద్ వారిని సత్కరించి, స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. ఇదిలా ఉండగా ఆదిత్యుని ఆదాయం రూ.10 లక్షల 52 వేల 283 వచ్చినట్లు ఆలయ ఇఒ తెలిపారు. టిక్కెట్ల ద్వారా రూ.7 లక్షల 20 వేల 900, ప్రసాద విక్రయాల ద్వారా రూ.2 లక్షల 72 వేల 950, విరాళాలు రూ.58 వేల 433 వచ్చినట్లు తెలిపారు.

దర్శించుకున్న ఎండోమెంట్ కమిషనర్

సూర్యనారాయణ స్వామిని ఏపి ఎండోమెంట్ కమిషనర్ కె.రామచంద్ర మోహన్ దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర శర్మ, ఆలయ ఇఒ ప్రసాద్, ఆలయం సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు. ప్రసాదాలను, చిత్రపటాన్ని అందజేశారు.



కవి సమ్మేళనంలో పాల్గొన్న కవులు

ఘనంగా తెరవే సాహితీ సమ్మేళనం

ప్రజాశక్తి- అరసవల్లి

నగరంలోని శాంతినికేతన్ కళాశాలలో తెలుగు రచయితల వేదిక ఆధ్వర్యంలో 110వ నెలవారీ సాహితీ సమ్మేళనం సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు ఉత్తరావల్లి నాగేశ్వరరావు, రఘుపాత్రుని వెంకట రమణమూర్తి నిర్వహణలో ఘనంగా నిర్వహించారు. సంస్థ గౌరవ సలహాదారు సురంగి మోహనరావు, గౌరవాధ్యక్షులు బలివాడ మల్లేశ్వరరావు ముఖ్య అతిథులుగా, తెరవే సంస్థ క్రియాశీలక సభ్యులు డా.బారువ కోమలరావు, తెప్పల కృష్ణమూర్తి ఆత్మీయ అతిథులుగా పాల్గొన్నారు. కార్యక్రమంలో కవులు ఇద్దీ పాపయ్య, ముట్నూరు ఉపేంద్రశర్మ, వాడాడ శ్రీనివాస్, ఐఎన్‌డి ప్రసాద్, బి.ఉమామహేశ్వరరావు, డబ్బీరు గోవింద రావు, డా.బి.కోమలరావు, తెప్పల కృష్ణమూర్తి, కె.బి.రవికిరణ్, తాలాసు విజయ లక్ష్మణ్, ఎస్.ఈశ్వరరావు, బి.జగన్నాథరావు, రోణంకి విశ్వేశ్వరరావు, సాయిభాను, కళాశాల ప్రిన్సిపాల్ పి.అప్పలరాజు తదితర 17 మంది కవులు పాల్గొని తమ కవితలు చదివి వినిపించారు. ఈ సందర్భంగా పొట్నూరు వెంకటరావుకు తెరవే ఘన నివాళి అర్పించారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలో సోమవారం పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేపడుతున్నట్టు ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమాల ఏర్పాట్లను ఆదివారం పరిశీలించారు. కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు హాజరవుతారని చెప్పారు. మండలంలోని పెద్దమడిలో ప్రభుత్వ బాలికల పాఠశాల అదనపు గదుల నిర్మాణానికి, మండల కేంద్రంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌లో అదనపు సిబ్బంది నివాసగృహాలకు శంకుస్థాపన చేస్తారని అన్నారు. చాపరలోని జెడ్‌పిహెచ్ స్కూల్‌లో లైబ్రరీ గదుల ప్రారంభిస్తారని చెప్పారు. కార్యక్రమంలో ఎంపిడిఒ నరసింహ ప్రసాద్ పండా, పిఎసిఎస్ అధ్యక్షులు సలాం మోహనరావు, గౌడ్ కార్పొరేషన్ డైరెక్టర్ భాస్కర్‌గౌడ, టిడిపి మండల అధ్యక్షులు నంబాల వెంకటరావు, బొచ్చు ప్రసాదరావు, రవ్వల గణపతిరావు, బసవ పరమేశ్వర్‌రెడ్డి, బైరిసింగి దినకర్ పాల్గొన్నారు.



అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న రమేష్ తదితరులు

అభివృద్ధి పనులు పరిశీలన

ప్రజాశక్తి- ఆమదాలవలస

మున్సిపాలిటీ పరిధిలోని మెట్టక్కివలసలో జరుగుతున్న అభివృద్ధి పనులను రాష్ట్ర టిడిపి నాయకుడు మొదలవలస రమేష్ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన 10, 11 వార్డుల్లో కొనసాగుతున్న సిసి రహదారులు, డ్రైనేజీ నిర్మాణాలు తదితర అభివృద్ధి కార్యక్రమాలను ప్రత్యక్షంగా పరిశీలించి, నాణ్యత ప్రమాణాలు తప్పక పాటించాలని గుత్తేదారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి పనులకు పెద్దఎత్తున శ్రీకారం చుట్టిందని, సిఎం చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్యే కూన రవికుమార్ ఆధ్వర్యంలో మున్సిపాలిటీలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి కార్యక్రమాలు సాగుతున్నాయని పేర్కొన్నారు. మున్సిపాలిటీ అభివృద్ధి కోసం అధిక నిధులను మంజూరు చేయించిన ఘనత ఎమ్మెల్యేదేనన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర బిసి సంఘం ప్రధాన కార్యదర్శి, జిల్లా టిడిపి సాధికార కమిటీసభ్యుడు నాగళ్ల మురళీధర్ యాదవ్, టిడిపి నాయకులు షేక్ మాలిక్, లంక నాగరాజు, రీసు చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో చదవడం మాకిష్టం



నీతి కథలు చెబుతున్న విద్యార్థి

లావేరు: స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. సుందరకాండ, నీతి కథలను గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు టి.వీరభద్రుడు, పాఠకులు పాల్గొన్నారు.

బిసిల ఐక్యత లక్ష్యం

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

రాష్ట్రంలో బిసి, ఒబిసి ఉద్యోగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో డిసెంబర్ నెలలో విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో రాష్ట్రస్థాయి ఉద్యోగ సంఘాల ఐక్య కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో సదస్సు ఏర్పాటు చేస్తున్నామని రాష్ట్ర బిసి, ఒబిసి ఉద్యోగ సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు గుత్తుల వీరబ్రహ్మం, పక్కి భూషణరావు చెప్పారు. స్థానిక ఆర్ట్స్ కళాశాల సమావేశ మందిరంలో ఆదివారం జిల్లా బిసి, ఒబిసి ఉద్యోగ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. ఈ ఎన్నికలకు ఎన్నికల అధికారిగా రాష్ట్రకమిటీ నుంచి వచ్చిన పి. రామచంద్రరావు వ్యవహరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉద్యోగ సంఘం అధ్యక్షుడు గుత్తుల వీరబ్రహ్మం మాట్లాడుతూ నవ్యాంధ్ర ప్రదేశ్‌లో బిసి, ఒబిసి ఉద్యోగ సంఘాల ప్రధాన లక్ష్యమని, ఉద్యోగుల ఐక్యత రాజ్యాంగం కల్పించిన హక్కుల సాధన అన్నారు. రాజధాని అమరావతిలో జ్యోతిరావు పూలే స్మారక భవన్ నిర్మాణానికి 25 ఎకరాల స్థలాన్ని కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరడం జరిగిందన్నారు. పదోన్నతుల్లో బిసి రిజర్వేషన్ పాటించాలని, మిగిలిన ఉద్యోగ సంఘాల తరహాలో ఉద్యోగ సంఘానికి అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో వివిధ ప్రభుత్వ శాఖల్లో సుమారు ఐదు లక్షల మంది సామాజిక వర్గానికి చెందిన వారు ఉద్యోగాలు చేస్తున్నారని, వీరి సంక్షేమానికి పెద్దపీట వేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఉన్న ఎనిమిది మంది బిసి మంత్రులను సిఎం చంద్రబాబు నాయుడు.. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖామంత్రి నారా లోకేష్‌లను ఆహ్వానించి, రాష్ట్ర సదస్సు అత్యంత వైభవంగా నిర్వహించి రాజ్యాంగం కల్పించిన హక్కుల సాధనకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర బిసి ఉద్యోగ సంఘాల నేతలు వై.శంకరరావు, పి.బాలభాస్కరరావు, వి.కామేశ్వరరావు, రామకృష్ణారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బిసి సంఘం నాయుకులు



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న వైసిపి నాయకులు

కొవ్వొత్తుల ర్యాలీ

ప్రజాశక్తి- నరసన్నపేట

కాశీబుగ్గ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం జరిగిన తొక్కిసలాటలో మృతుల సంతాపంగా పోలాకి జెడ్‌పిటిసి ధర్మాన కృష్ణదాస్ ఆధ్వర్యాన మండలంలోని ఉర్లాం కూడలి వైఎస్ఆర్ విగ్రహం వద్ద ఆదివారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిపి ఆరంగి మురళీధర్, జెడ్‌పిటిసి జెడ్పీటీసీ చింతు రామారావు, పొందర కూరకుల విభాగం అధ్యక్షులు రాజపు అప్పన్న, వైసిపి మండల అధ్యక్షులు లుకలాపు రవి, నియోజకవర్గ బూత్ కమిటీ అధ్యక్షులు సురంగి నర్సింగరావు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: కాశీబుగ్గ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం జరిగిన తొకిసలాటలో ప్రాణాలు కోల్పోయిన వారికి నివాళ్లర్పిస్తూ వైసిపి నాయకులు బస్టాండ్ వద్ద కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ నుంచి బజారు మీదుగా బస్టాండ్ వద్దకు చేరుకుని మానవహారం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి (పార్లమెంటరీ) సాడి శ్యాం ప్రసాద్‌రెడ్డి, బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి, వైసిపి మహిళా విభాగ జిల్లా అధ్యక్షులు ఉలాల భారతీదివ్య, నియోజకవర్గ యువజన అధ్యక్షులు నర్తు ప్రేమ్‌కుమార్, ఎంపిపి పైల దేవదాస్‌రెడ్డి, వైస్ చైర్‌పర్సన్ లాభాల స్వర్ణమణి, ప్రతి అన్వేష్, నర్తు ప్రసాద్, సల్లా దేవరాజు, బచ్చు జగన్ పాల్గొన్నారు.

నడకపై అవగాహనా కార్యక్రమాలు

ప్రజాశక్తి- అరసవల్లి

నడక ఉద్యమాన్ని మరింత బలోపేతం చేసేందుకు ఉత్తరాంధ్ర జిల్లాల పరిధిలో పెద్ద ఎత్తున నడకపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని ఎలెక్ట్ గవర్నర్ ఆరిక తిరుపతిరావు అన్నారు. ఆదివారం నగరంలో ఆర్ట్స్ కళాశాల ఆవరణలో స్టార్‌వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో.విజయనగరం నుంచి వచ్చిన వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధులకు సత్కరించారు. ఈ సందర్భంగా తిరుపతిరావు మాట్లాడుతూ నడకే దివ్య ఔషధం అని అందరూ గుర్తించి నడక సంఘాల్లో చేరుతున్నారన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా వాకర్స్ క్లబ్స్ బలోపేతం చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. వాకర్స్ డైరెక్టరీలో ప్రతిఒక్కరూ సభ్యులు కావాలన్నారు. కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థ గవర్నర్ కొంక్యాన మురళీ మోహన్, మాజీ గవర్నర్ డాక్టర్ ప్రకాశరావు, వాకర్స్ ప్రతినిధులు గేదెల ఇందిరా ప్రసాద్, శాసపు జోగినాయుడు, పీజీ గుప్తా, ఎస్.సంజీవరావు, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై. పోలినాయుడు, స్టార్ మహిళా క్లబ్ ప్రతినిధి గేదెల లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు. కాశీబుగ్గ ఘటనలో మృతిచెందిన వారికి ఐదు నిమిషాలు మౌనం పాటించారు.



మౌనం పాటిస్తున్న వాకర్స్ ప్రతినిధులు



పోలాకి : సంతకాల కార్యక్రమం నిర్వహిస్తున్న వైసిపి నాయకులు

పిపిపిపై సంతకాల సేకరణ

ప్రజాశక్తి- పోలాకి

ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమం మండలంలోని మండలం పిన్నింటిపేట కూడలిలో జెడ్‌పిటిసి ధర్మాన కృష్ణచైతన్య అధ్యక్షతన ఆదివారం కోటి సంతకాల స్టాల్ ఏర్పాటు చేశారు. ప్రజలు, వర్తకులు, విద్యార్థులు, కాలశీలు సంతకాలు చేపట్టడంతో స్పందన లభించిందని కృష్ణచైతన్య తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల కార్యక్రమానికి ప్రజలు విద్యార్థులు, ఉద్యోగులు స్వచ్ఛందంగా వచ్చి సంతకాలు పెడుతున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరణ నిర్ణయాన్ని మార్చుకోకపోతే ఈ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపిపి ముద్దాడ బైరాగినాయుడు, వైసిపి మండల అధ్యక్షులు కణితి కృష్ణారావు, నియోజకవర్గ విద్యార్థి విభాగం అధ్యక్షులు సాలిన నగేష్, నియోజకవర్గ ఎస్‌సి సెల్ అధ్యక్షులు కల్లేపల్లి లక్ష్మణరావు, రాష్ట్ర యువజన కార్యదర్శి చింతు రాఘవ, మండల బూత్ కమిటీ అధ్యక్షులు చింతాడ ఉమామహేశ్వరరావు, మండల పంచాయతీరాజ్ అధ్యక్షులు దంత రమణ పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: కింజరాపు కుటుంబానికి తెలిసింది ఒకే ఒక్కటి దోచుకోవడం దాచుకోవడం మేనని టెక్కలి నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి పేరాడ తిలక్ ఆరోపించారు. మండలంలోని రేగులపాడు, సౌడాం గ్రామాల్లో రచ్చండ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు హేమసుందర్, జిల్లా ఉపాధ్యక్షులు అన్నెపు రామారావు, జెడ్‌పిటిసి దుబ్బ వెంకటరావు, ఎంపిపి రోణంకి ఉమా మల్లయ్య పాల్గొన్నారు.

రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

కాశీబుగ్గ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం జరిగిన తొక్కిసలాటలో మృతి చెందిన కుటుంబ సభ్యులకు కూటమి ప్రభుత్వం రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని వైసిపి రాష్ట్ర కార్యదర్శి నరేంద్ర యాదవ్ ఒక ప్రకటనలో కోరారు. అలాగే క్షతగాత్రులకు రూ.10 లక్షలు చెల్లించాలన్నారు. ఈ ఘటన ప్రభుత్వ వైఫల్యం స్పష్టంగా కనిపిస్తుందన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

ప్రజాశక్తి- కవిటి

మండలంలోని మెళియాపుట్టుగకు చెందిన సీనియర్ వాలీబాల్ క్రీడాకారుడు జగ్గారావుకు జైహింద్ ఫౌండేషన్ అండగా నిలిచింది. జగ్గారావు ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్న విషయం తెలుసుకున్న ఫౌండేషన్ సభ్యులు ఆదివారం గ్రామానికి చేరుకుని జోగారావును పరామర్శించారు. అనంతరం ఫౌండేషన్ సభ్యుడు ధర్మాన ప్రకాష్ ఆర్థిక సహకారంతో నెలకు సరిపడే నిత్యవసర సరుకులు, రూ.2 వేలు నగదు అందించారు. ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

తుపాను బాధితులకు అండ

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మండలంలోని కేశుపురానికి చెందిన దూడ మోహినమ్మ ఇంటి గోడ తుపానుకు కూలిపోయింది. దీంతో తల్లీబిడ్డలు తల దాచుకోవటానికి గూడు లేకుండాపోయింది. విషయం తెలుసుకున్న కాశీమాత సేవా సంఘం తక్షణ సాయం కింది రూ.50 వేలు ఆర్థికసాయం ఆదివారం అందించి దాతృత్వం చాటుకున్నారు. అలాగే ప్రభుత్వం తరుపున సంబధిత అధికారులు నాయకులు స్పందించి తగిన నష్ట పరిహారం అందించేందుకు కృషి చేయాలని కోరారు.



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న రాజేష్

బాధిత కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి- సోంపేట

కాశీబుగ్గలోని వెంకటేశ్వర ఆలయంలో శనివా రం జరిగిన తొక్కిసలాటలో బెంకిలికి చెందిన విద్యార్థి లొట్ల నిఖిల్ మృతి చెందారు. మృతుడు కుటుంబాన్ని స్థానిక ప్రజా ప్రతినిధులు పరామర్శించి ఆదివారం పరామర్శించారు. కార్యక్రమంలో జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి లోళ్ల రాజేష్, స్థానిక ఎంపిపి నిమ్మన దాసు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిం చారు. సంఘటనకు దారి తీసిన పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం తరుపున సహాయం అందజేస్తున్నామన్నారు. పి.రవీంద్ర వర్ధన్, శంకర్, ఆర్. భాస్కర్‌రెడ్డి, డి.నీలవేణిరెడ్డి, పిరియా ధర్మేంద్ర, ఎస్. జాని, పి. బాబూరావు, మోహనరావు, లోకనాథం పాల్గొన్నారు.

ప్రజాశక్తి- మందస

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో గణితంపై ఆసక్తిని పెంచేందుకే గణిత ప్రతిభా పరీక్షలు నిర్వహిస్తున్నట్లు మందస మండల సిక్కోలు గణిత వేదిక ప్రతినిధులు గవ్వ భీమారావు, వమరవల్లి మురళి సిక్కోలు గణిత ఉపాధ్యాయ వేదిక, శ్రీకాకుళం ఆధ్వర్యాన ఏటా జాతీయ గణిత దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 8,9,10 తరగతి విద్యార్థులకు మండల స్థాయి, జిల్లా స్థాయి గణిత ప్రతిభ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. మండలస్థాయి గణిత ప్రతిభ పరీక్షను హరిపురం ఉన్నత పాఠశాల కేంద్రంగా ఆదివారం నిర్వహించామన్నారు. ఈ పరీక్షలో మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల నుంచి 140 మంది వరకు విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జి.రమణబాబు, నడుమూరు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.చక్రధర్, కె.సాంబమూర్తి పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: సిక్కోలు గణిత ఉపాధ్యాయ సంఘ ఆధ్వర్యాన స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల కోటబొమ్మాళి ఆవరణలో 8,9,10 విద్యార్థులకు మండల స్థాయి గణిత ప్రతిభా పరీక్ష నిర్వహించారు. మండలంలోని 17 ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలల నుంచి 8వ తరగతి నుంచి 80 మంది, 9వ తరగతి నుంచి 73 మంది, పదో తరగతి నుంచి 79 మంది మొత్తం 232 మంది విద్యార్థులు ఈ పోటీ పరీక్షలో పాల్గొన్నారు. ప్రధానోపాధ్యాయులు ఎం.కృష్ణారావు ప్రశ్నాపత్రాలను ఆవిష్కరించారు.

ప్రతిభా పరీక్షకు స్పందన

కొత్తూరు : సిక్కోలు గణిత ఉపాధ్యాయ వేదిక ఆధ్వర్యాన మండల స్థాయి గణితం ప్రతిభ పరిక్ష స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ప్రతిభా పరీక్షకు మండలంలోని మెట్టూరు, కుంటిభద్ర, నివగాం, మాతల, కడుము, బలద, మాకవరం, కురిగాం, కెజిబివి పాఠశాలల నుంచి 161 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో గణిత ఉపాధ్యాయులు వేదిక కో-ఆర్డినేటర్, దండు ప్రకాశరావు, ప్రభుత్వం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.గోవిందరావు, ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు బి.వెంకటరమణ, ఎల్.సింహాద్రి నాయుడు, గణితశాస్త్ర కె.వెంకటరావు, ఎల్.గోవర్ధనరావు, బి.కాంతారావు, కె.మాధవరావు, కె.స్వాతి, బి.కొండయ్య, శాంతారావు, వి.హరనాథరాజు, ఎ.శోభనబాబు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



పొందూరు : గణిత పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

పొందూరు: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సిక్కోలు గణిత ఉపాధ్యాయ వేదిక ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన మండలస్థాయి గణిత పోటీల్లో ఎపి మోడల్ స్కూల్‌కు చెందిన 8 మంది విద్యార్థులు జిల్లాస్థాయి గణిత పోటీలకు ఎంపికయ్యారు. ఎపి మోడల్ స్కూల్‌లోని ఎనిమిదో తరగతికి చెందిన జి.కీర్తి, ఎ.సత్యప్రియ, 9వతరగతి చెందిన ఎ.మౌనిక, కె.కౌసల్య, పదో తరగతికి చెందిన బి.లోకేష్, వి.ప్రవీణ్, డి.రోహిత. ఎ.శ్రీహర్షలు జిల్లాస్థాయి గణిత పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ హెచ్ ప్రభాకర్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు ప్రిన్సిపాల్ ప్రభాకర్, గణిత ఉపాధ్యాయులు బి.వి.సత్యనారాయణ, డి.భవానిలు, పాఠశాల సిబ్బంది అభినందనలు తెలిపారు.

అప్పారావు, సూర్యనారాయణ అశయాలు కొనసాగిద్దాం

ప్రజాశక్తి- పలాస

బొడ్డు అప్పారావు, బుచ్చల సూర్యనారాయణ ఆశయాలను కొనసాగించి నప్పుడే వారికి ఇచ్చే నిజమైన నివాళి అని వక్తలు పేర్కొన్నారు. మండలంలోని బొడ్డపాడులో గిరిజన హక్కుల సాధన సంఘం రాష్ట్ర కన్వీనర్ బచ్చుల విప్లవ కుమార్ అధ్యక్షతన అప్పారావు, సూర్యనారాయణ సంతాప సభ నిర్వహించారు. ముందుగా వారి చిత్ర పటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్దాన ప్రాంత అభివృద్ధికి కృషి చేసిన అప్పారావు, సూర్యనారాయణ మృతి చెందడం బాధాకరమన్నారు. తామాడ గణపతి, సుబ్బారావు పాణిగ్రాహి, పంచాది కృష్ణమూర్తి, ధర్మపురం గోవింద మాస్టర్ నేతృత్వంలో ఏర్పడిన బొడ్డపాడు యువజన సంఘంలో క్రియాశీలకంగా భాగస్వాములై ఉద్యమాలు చేపట్టారని చెప్పారు. ఉద్దాన ప్రాంతంలో తాగునీటి సమస్య, విద్యాలయాలు నిర్మించాలని ఉపాధ్యాయులు కావాలని డిమాండ్ చేస్తూ ఉద్యమాలు చేపట్టారని గుర్తు చేశారు. బొడ్డపాడులో జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలకు ఉపాధ్యాయులు కావాలని, బిసి హాస్టల్‌ను నిర్మించాలని కాశీబుగ్గలో ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారన్నారు. కార్యక్రమంలో సిపిఐ, సిపిఎం, సిపిఐఎంఎల్ లిబరేషన్, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ, సిపిఐఎంఎల్ జనశక్తి, పౌర హక్కుల సంఘం (సిఎల్‌సి), ప్రజా కళా మండలి, ప్రగతిశీల కార్మిక సమైక్య, దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం (పిడిఎం), ఉద్దాన విద్య అభివృద్ధి వేదిక, వామ పక్ష, ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మోహనరావు

రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్‌కు ఏర్పాట్లు



ట్రాక్ పనులను పరిశీలిస్తున్న పద్మలోచన

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

రాష్ట్రస్థాయి అండర్-14 స్కూల్ గేమ్స్ అథ్లెటిక్స్ పోటీలకు ఏర్పాట్లు చేస్తున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.హరిబాబు తెలిపారు. ఆదివారం ఆటస్థలంలో ట్రాక్‌ల నిర్మాణం పనులను పరిశీలించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గోవిందపురంలో రాష్ట్రస్థాయి అండర్-14 స్కూల్ గేమ్స్ అథ్లెటిక్స్ పోటీలు ఈ నెల 8,9 తేదీల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల సన్నాహక పనులను జిల్లా వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు, మీట్ ఆర్గనైజర్ తవిటయ్య పర్యవేక్షణలో ముమ్మరంగా చేపడుతున్నామన్నారు. వ్యాయామ ఉపాధ్యాయులు పద్మలోచన, గజేంద్ర, నాగరాజు, చంద్రశేఖర్, రామారావు, హరికృష్ణ, కె.రామారావు పాల్గొన్నారు.

కృపారాణి పరామర్శ

పలాస: కాశీబుగ్గ వెంకటేశ్వర స్వామి ఆలయ సముదాయంలో జరిగిన తొక్కిసలాట సంఘటనలో గాయపడిన క్షతగాత్రులను పలాస ప్రభుత్వ ఆసుపత్రిలో మాజీ మంత్రి కిల్లి కపారాణి పరామర్శించారు. జరిగిన ఘటన ఏలా జరిగింది, వైద్యులు పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందిస్తున్నారా, ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని క్షతగాత్రులను అడిగి తెలుసుకున్నారు. ఘటనలో బాగంగా కాశీబుగ్గకు చెందిన డొక్కరి.అమ్ములమ్మ మతి చెందడంతో కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆమెతో పాటు కిల్లి రామమోహనరావు, పేడాడ పరమేశ్వరరావు, కౌన్సిలర్ దువ్వాడ.శ్రీకాంత్, సీతమ్మ,గుప్తా,రమేష్,సతీష్ తదితరులు ఉన్నారు.

లక్ష్మణరావు మృతి బాధాకరం

ఆమదాలవలస: సీనియర్ జర్నలిస్ట్, న్యాయవాది చౌదరి లక్ష్మణరావు అకాల మరణం బాధాకరమని సీనియర్ జర్నలిస్ట్ సువ్వారి మురళీధరరావు అన్నారు. ఆదివారం పట్టణంలోని పాత్రికేయుల సంఘం కార్యాలయంలో లక్ష్మణరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మురళీధరరావు మాట్లాడుతూ జర్నలిస్ట్ లక్ష్మణరావు సామాజిక చైతన్యంతో పాటు ప్రజల సమస్యలపై ఎల్లప్పుడూ స్పందించే వారని, పాత్రికేయుడిగా మాత్రమే కాకుండా ప్రజా ఉద్యమాల సారధిగా కూడా గుర్తింపు పొందారని పేర్కొన్నారు. కార్యక్రమంలో న్యాయవాది బొడ్డేపల్లి మోహనరావు, విలేఖరులు టి.ధనుంజయరావు, కంచరాపు హరి, ఎం.సుబ్బారావు, బి.శివప్రసాద్, పి.మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



లక్ష్మణరావు చిత్రపటానికి నివాళ్లర్పిస్తున్న మురళీధరరావు తదితరులు